క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక రాజరాజేశ్వరి దేవి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. రాఖీ పౌర్ణమి దృష్ట్యా భక్తులకు రక్షా బంధన్ విశిష్టతను ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీధర్ వివరించారు. నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని శ్రీకృష్ణ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పుస్తకాలు వినియోగించుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్‌యూ వీసీ ఆనందరావు, రెక్టార్ కృష్ణారెడ్డి

కర్నూలు (న్యూసిటీ): విద్యార్థులు పుస్తకాలను వినియోగించుకుని ఉద్యోగాలు సాధించాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు సూచించారు. పారామౌంట్ పబ్లికేషన్స్ నేతృత్వంలో ఐఏఎస్‌ఈ ప్రభుత్వ కళాశాల వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ వై.కళ్యాణ్‌కుమార్ రచించిన 'కాంపిటీటివ్ ఎడ్జ్ ఎక్సెల్లింగ్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వాల్యూమ్ 1, 2' పుస్తకాన్ని గురువారం యూనివర్సిటీలో వీసీ ఆనందరావు ఆవిష్కరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఎల్, డీఎల్, కేంద్రీయ విద్యాలయ, నవోదయ, డీఎస్సీ పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా పుస్తకాన్ని తయారు చేశారు. ప్రభుత్వ కొలువులే లక్ష్యంగా పెట్టుకొని చదువుతున్న నిరుద్యోగులు ఈ పుస్తకాన్ని సద్వినియోగించుకోవాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ కృష్ణారెడ్డి, ఐఏఎస్‌ఈ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ఆదినారాయణరెడ్డి, జేఎన్‌టీయూ డైరెక్టర్ జోజిరెడ్డి, డాక్టర్ శివకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్ సేవలు ఎనలేనివి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధిలో కార్డియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పి.చంద్రశేఖర్ చేసిన సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. డాక్టర్ పి.చంద్రశేఖర్ పదవీ విరమణను పురస్కరించుకుని గురువారం న్యూ లెక్చర్ గ్యాలరీలో ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ చంద్రశేఖర్ సుదీర్ఘకాలంగా కార్డియాలజీ విభాగంలో వైద్యసేవలు అందించారన్నారు. సూపరింటెండెంట్‌గా, ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ చిట్టి నర్సమ్మ, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, హెచ్‌ఓడీలు, ఆయా విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

నేడు బస్సు యాత్ర రాక

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రాన్ని రక్షించుకుందాం .. దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం కర్నూలు నగరంలోకి ప్రవేశించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య తెలిపారు. గురువారం ఆయన సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటలకు బస్సు యాత్ర నంద్యాల చెక్‌పోస్టు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి 1,000 మందితో పాతబస్టాండ్ లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడే బహిరంగ సభను నిర్వహించనున్నట్లు చెప్పారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీఐ మురళీధర్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): తోటి విద్యార్థులను, జూనియర్లను ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి చెప్పారు. గురువారం సాయంత్రం కర్నూలు మెడికల్ కళాశాల యూజీ హాస్టల్‌లో వైద్య విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థి వైద్య విద్య పట్టా రద్దు అవుతుందని, జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థి సైతం తీవ్ర మనోవేదనతో చదువులో వెనుకబడతాడని, ఈ కారణంగా వారి తల్లిదండ్రుల ఆశలు అడియాశలవుతాయన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, లీగల్ అడ్వైజర్ అనుదీప్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ జయరాం పాల్గొన్నారు.








గవర్నర్‌కు ఘనస్వాగతం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొనేందుకు గురువారం మధ్యాహ్నం కర్నూలు బి.క్యాంప్‌లోని పోలీసు అతిథి గృహానికి చేరుకున్న ఏపీ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఘనస్వాగతం లభించింది. జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఐజీ సెంథిల్‌కుమార్, నగర మేయర్ బీవై రామయ్య, ఎస్పీ కృష్ణకాంత్, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ తదితరులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం 3:40 గంటలకు పోలీసు అతిథిగృహం నుంచి మంత్రాలయం బయలుదేరి వెళ్లారు.

– కర్నూలు

విద్యుత్ బకాయిలు @ రూ.1.16 కోట్లు

- పెద్దాసుపత్రిలో ప్రైవేటు సంస్థల నిర్వాకం
- అధికారులు అడిగినా పట్టించుకోని సంస్థల ప్రతినిధులు
- పది రోజుల్లో చెల్లించకపోతే సీజ్ చేస్తామని జిల్లా కలెక్టర్ హెచ్చరిక



ఆసుపత్రిలోని ఎస్ఎల్ డయాగ్నోస్టిక్స్ నిర్వహిస్తున్న సీటీ స్కాన్ కేంద్రం



ప్రమోదిని సంస్థ నిర్వహిస్తున్న ఎంఆర్‌ఐ స్కాన్ కేంద్రం

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా మనం ఇళ్లలో వాడే విద్యుత్‌కు కరెంట్ బిల్లు సకాలంలో చెల్లించకపోతే గడువు తీరిన వెంటనే అధికారులు కనెక్షన్ తొలగిస్తారు. బిల్లు మొత్తాన్ని తిరిగి చెల్లించాకే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. కానీ ప్రభుత్వ భవనంలో ఉండి, ప్రభుత్వ ఆసుపత్రి విద్యుత్ వాడుకుంటూ వారికి బిల్లులు చెల్లించకుండా ఉంటున్న ఏజెన్సీల ఉదంతమిది. ఒకటి కాదు.. రెండు కాదు ఒక్కో సంస్థ లక్షలాది రూపాయల బకాయిలు ఉన్నా చెల్లించడం మాని అధికారులనే గట్టిగా మాట్లాడే పరిస్థితికి వచ్చారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొన్నేళ్లుగా పలు రకాల వైద్యసేవలు ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని సేవలకు తగిన మూల్యాన్ని పొందుతున్నాయి. అది కూడా ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలోనే ఆయా సంస్థలు తమ సేవా కేంద్రాలను నెలకొల్పి ఇక్కడి విద్యుత్‌నే వాడుకుంటూ ఉన్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో ఉండటంతో ప్రత్యేక మీటర్ ఏర్పాటు చేసి వారికి విద్యుత్ కనెక్షన్‌ను ఇచ్చారు అధికారులు. మీటర్‌లో రీడింగ్‌ను బట్టి ఆయా సంస్థలు ప్రతి నెలా బిల్లులు చెల్లించాల్సి ఉంది. కానీ కొన్నేళ్లుగా ఆయా సంస్థలు విద్యుత్ బకాయిలు చెల్లించకుండా నాన్చుతూ వస్తున్నాయి. ఈ విషయమై మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశంలో చర్చకు వచ్చింది. సదరు సంస్థల ప్రతినిధులను పిలిచి కమిటీ చైర్‌పర్సన్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, సభ్యులు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, డాక్టర్ జి.సుధాకర్ బిల్లుల బకాయిలపై ప్రశ్నించారు. తమకు బిల్లులు రావాల్సి ఉందని, అవి వచ్చాక చెల్లిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు సమాధానం ఇవ్వడంతో కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆసుపత్రి భవనంలో ఉంటూ ఆసుపత్రి విద్యుత్‌ను వాడుకుంటూ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని సమాధానం చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.యజమానులతో మాట్లాడి ఎప్పుడిస్తారో తేల్చి చెప్పాలని ఆదేశించారు. దీంతో కొద్దిసేపటి అనంతరం వచ్చిన ప్రతినిధులు తమకు మూడు నెలల సమయం కావాలని కోరగా.. అంత సమయం కుదరదని, వచ్చే నెల 10వ తేదీ లోపు చెల్లించకపోతే సీజ్ చేస్తామని కమిటీ హెచ్చరించింది.

రూ.1.16 కోట్లకు పైగా విద్యుత్ బకాయిలు

ఆసుపత్రిలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఎంఆర్‌ఐ సేవలను పీపీపీ పద్ధతిలో ప్రమోదిని సంస్థ నిర్వహిస్తోంది. ఈ కేంద్రంలో ఆసుపత్రికి వచ్చిన రోగికి ఎంఆర్‌ఐ చేస్తే రూ.2,689లను ప్రభుత్వం వీరికి చెల్లిస్తుంది. ఇక్కడ ప్రతిరోజూ 40 నుంచి 50 వరకు ఎంఆర్‌ఐ పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ సంస్థ ప్రస్తుతం రూ.66 లక్షల విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. అలాగే సీటీస్కాన్ సేవలను అందిస్తున్న ఎస్ఎల్ డయాగ్నోస్టిక్స్ సంస్థ సైతం ఒక్కో రోగికి సీటీస్కాన్ చేస్తే రూ.799 లను ప్రభుత్వం నుంచి తీసుకుంటుంది. ఈ సంస్థ కూడా కొన్నేళ్లుగా రూ.35 లక్షల విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతోపాటు డయాలసిస్ సేవలను అందించే నెఫ్రోప్లస్ సంస్థ సైతం రూ.7.70 లక్షల విద్యుత్ బకాయి ఉంది. ఈ మూడు సంస్థలూ ఆసుపత్రిలోని ప్రభుత్వ స్థలంలోనే వాటి కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఇందుకు అద్దె కూడా చెల్లించడం లేదు. అదే ప్రైవేటుగా అయితే వేలాది రూపాయలు అద్దె చెల్లించాల్సి వచ్చేది. వీరే గాక ఆసుపత్రిలో నిర్మాణాలు చేస్తున్న పలు భవన నిర్మాణ కాంట్రాక్టర్లు సైతం ఆసుపత్రిలోని విద్యుత్‌ను వాడుతున్నారు. ఈ మేరకు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కాంట్రాక్టర్ రూ.7.60 లక్షలు, పీజీ హాస్టల్ భవన కాంట్రాక్టర్ రూ.60 వేలు విద్యుత్ వాడుకున్నందుకు చెల్లించాల్సి ఉంది.

10 లోపు చెల్లించకపోతే సీజ్ చేస్తాం

ఆసుపత్రిలోని ప్రైవేట్ సంస్థలు, ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు వాడుకున్న విద్యుత్‌కు బకాయిలను సెప్టెంబర్ 10వ తేదీలోగా చెల్లించాలని ఆదేశించాం. లేకపోతే తహసీల్దార్ సమక్షంలో వారి సంస్థలను సీజ్ చేస్తాం. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, సభ్యులు సైతం ఇదే విషయం చెప్పారు.

– డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

4న కెమిస్ట్రీ ఫ్యాకల్టీ నియామకానికి ఇంటర్వ్యూ

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఐఐటీ – నీట్ అకాడమీ చిన్నటేకూరులో కెమిస్ట్రీ ఫ్యాకల్టీ కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని జిల్లా కోఆర్డినేటర్ ఏ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు https://jnbnivas.apscfss.in/ సందర్శించాలన్నారు.

సంచార జాతుల అభివృద్ధికి కేంద్రం నాంది



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి

కర్నూలు కల్చరల్: సంచార జాతుల అభివృద్ధికి నాంది పలికింది నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వమని బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల కులాలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విస్మరించారన్నారు. సమావేశంలో బీజేపీ సంచార జాతుల మోర్చా రాష్ట్ర కన్వీనర్ అరబోలు చంద్రశేఖర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహవర్మ, జిల్లా ఓబీసీ అధ్యక్షులు మాలేకర్ శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ఓబీసీ అధ్యక్షులు శివకృష్ణ యాదవ్, జిల్లా సంచార జాతుల కన్వీనర్ సురేంద్రబాబు, కో కన్వీనర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

- జెడ్పీ సీఈఓ జి నాసరరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి నాసరరెడ్డి, ఏడీ రయిసా ఫాతిమా

కర్నూలు(అర్బన్): ప్రభుత్వం అందిస్తున్న సహాయ పరికరాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి విభిన్న ప్రతిభావంతులకు సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆలింకో సౌజన్యంతో జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసిన విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్య, ఆర్థిక పరంగా సహకారం అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. వివిధ సంస్థలు కూడా చేయూతనిస్తున్నాయన్నారు. ఏడీ రయిస్ ఫాతిమా మాట్లాడుతూ మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్, చంక కర్రలు, బ్యాటరీతో నడిపే మూడు చక్రాల సైకిళ్లు, శ్రవణ యంత్రాలు, అంధుల చేతి కర్రలు తదితర సహాయ పరికరాలు అవసరమైన వారిని గుర్తించామన్నారు. వీరికి రూ.16.10 లక్షల విలువైన పరికరాలను అందించనున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 2న ఎమ్మిగనూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి శిబిరాన్ని సందర్శించారు. ఐఓసీఎల్ మేనేజర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

6న వీహెచ్‌పీ షష్టబ్ది ఉత్సవాల సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్టబ్ది ఉత్సవాల ప్రారంభ సభ ఈనెల 6న కర్నూలు నగరంలో జరుగుతుందని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం రెవెన్యూ కాలనీలో ని వీహెచ్‌పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి వీహెచ్‌పీ అంతర్జాతీయ ప్రధాన (కేంద్రీయ ప్రధాన కార్యదర్శి) కార్యదర్శి మిలింద్ పరాండే హాజరు అవుతారన్నారు.అనుబంధ సంఘాల నాయ కులు, కార్యకర్తలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందూ బంధువులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్, కోశాధికారి సందడి మహేష్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, విభాగ్ కన్వీనర్ గురుమూర్తి, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, కార్యదర్శి భాను ప్రకాష్, మాతృశక్తి కన్వీనర్ రాధిక, దుర్గావాహిని కన్వీనర్ లక్ష్మి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

కర్నూలు సిటీ: స్థానిక టౌన్ మోడల్ హైస్కూల్‌లో బాలల హక్కులు, బాలల సమస్యలపై, బాల్య వివాహ నిషేధ చట్టం–2006పై గురువారం అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్–1098, జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలికలకు కోమల్ వీడియో ద్వారా 'సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్' గురించి వివరించారు. బాల, బాలికలను వేధింపులకు గురిచేస్తే వెంటనే హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని ఉచిత న్యాయ సేవా సదస్సు పారా లీగల్ వలంటీర్ రాయపాటి శ్రీనివాసులు, చైల్డ్ హెల్ప్‌లైన్–1098 కో–ఆర్డినేటర్ సుంకన్న తెలిపారు. బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, తప్పి పోయిన పిల్లలు, బాల కార్మికులను వేధింపులకు గురవుతున్న పిల్లలు ఉన్నా కూడా హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలన్నారు.

గడప గడపకు గ్రంథాలయ సేవలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



ర్యాలీలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కర్నూలు కల్చరల్: గడప గడపకు గ్రంథాలయ సేవలు విస్తరింపజేస్తామని, గ్రామ గ్రామాన గ్రంథాలయ చైతన్య యాత్రలు నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. బీ.క్యాంప్ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన గ్రంథాలయ చైతన్య యాత్ర ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు.చైతన్య యాత్రల ద్వారా ప్రజలను చైతన్యం చేసి గ్రంథాలయ సభ్యులుగా చేరేందుకు కృషి చేస్తామన్నారు. గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఉపన్యాసకురాలు పార్వతి, హమీద, లైబ్రేరియన్ మద్దయ్య, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, బీక్యాంప్ శాఖ లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్లు గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



వృద్ధుడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన 46వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బృందావన్ అపార్ట్‌మెంట్ నుంచి అశోక్ నగర్ వరకు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీటిలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ పథకమైనా ఇంటి వద్దకే వస్తుందన్నారు. ప్రభుత్వ సేవల కోసం వివిధ శాఖల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును నియమించడంతో దరఖాస్తు మొదలు పథకం మంజూరు వరకు అన్నీ వారే దగ్గరుండి చేయిస్తారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ వాసు, నాయకులు యూసూఫ్, భాస్కరరెడ్డి, మల్లి, హసీనా, ఆంజనేయులు, చందు, సురేష్, దావూద్, మౌలాలి, సజ్జద్, జహీర్, రషీద్, ఇంతియాజ్‌ఖాతూన్ పాల్గొన్నారు.

రక్షాబంధన్‌తో మహిళల జీవితాల్లో వెలుగులు

రక్షాబంధన్‌తో మహిళల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో రాఖీ పండుగ వేడుకలను మహిళలతో కలిసి నిర్వహించుకున్నారు. 42వ వార్డు ఇన్‌చార్జి కాశిరెడ్డి శ్వేతారెడ్డి, జిల్లా కమిటీ ఈసీ మెంబర్ చెన్నమ్మ, నాయకులు విజయలక్ష్మితో పాటు పలువురు మహిళలు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

డీసీసీబీలో రాఖీ వేడుకలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు, డీజీఎంలు సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్ తదితరులకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీని పురస్కరించుకొని స్వీట్లు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... సోదరభావంతో సమిష్టిగా పనిచేసి బ్యాంకును మరింత అభివృద్ధి బాటలో నడిపిద్దామన్నారు.

అక్కాచెల్లెమ్మలకు అండగా రక్షాబంధన్

కర్నూలు(సెంట్రల్): అక్కాచెల్లెమ్మలకు రక్షా బంధన్ అండగా నిలుస్తోందని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రక్షాబంధన్‌ను పురస్కరించుకొని నగరంలోని పలువురు మహిళలు ఆయనకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఎస్వీ మోహన్‌రెడ్డి తమకు సోదరుడిగా ఉన్నారని వారు పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలన్నీ ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు శ్రీనివాసరావు, బాబురావు, రామాంజనేయులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు



మాట్లాడుతున్న సోమన్న

కర్నూలు(సెంట్రల్): హాల్‌టికెట్లకు మెస్ బిల్లులకు ముడిపెట్టి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న రాయలసీమ యూనివర్సిటీ అధికారులను కోరారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైస్‌చాన్స్‌లర్ తీరుతో పలువురు విద్యార్థులు చదువులకు స్వస్తి చెబుతున్నారన్నారు. మెస్ బిల్లులు చెల్లిస్తేనే హాల్ టిక్కెట్లు ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. సమావేశంలో నాయకులు అశోక్, రవి, కల్యాణ్, రంగస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.


అప్పన్న సన్నిధిలో ఎంపీ



ఆలయ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులతో కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

సింహాచలం: విశాఖపట్నంలోని సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. అప్పన్న దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఎంపీ ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామివారికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి సమర్పించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో భ్రమరాంబ ఎంపీ దంపతులకు అందజేశారు.

పనులు పూర్తి చేయండి



పనుల గురించి అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 17 వ వార్డు వినాయక్‌ఘాట్ వద్ద చిరువ్యాపారుల సముదాయ ప్రాంతం (హాకర్ జోన్) పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక హాకర్ జోన్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. పాతబస్తీలోని కింగ్ మార్కెట్ వద్ద చేపడుతున్న మున్సిపల్ పార్కు నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవిప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఏపీకి పతకాలు

కర్నూలు (టౌన్): గత నెల 26, 27 తేదీలలో హర్యానాలోని కురుక్షేత్ర యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో ఏపీ జట్టు పతకాలు సాధించిందని కరాటే అసోసియేషన్ ఏపీ అధ్యక్షులు కోలా ప్రతాప్ గురువారం తెలిపారు. పురుషుల కుమితి విభాగంలో చైతన్య రెడ్డి రజతం, బాలికల విభాగంలో (కటాస్) విష్ణుప్రియ, దీపిక, అభిజ్ఞతేజ బంగారు, సాత్విక్, వైష్ణవ సచిన్ రజతం, జస్వంత్, హవిలాన్ రజత పతకాలు సాధించినట్లు చెప్పారు.

కుల వివక్షతను నిర్మూలిద్దాం

కర్నూలు (న్యూసిటీ): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కుల వివక్షతను నిర్మూలించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సభ్యుడు పీటీ సాయి ప్రదీప్ తెలిపారు. గురువారం కండేరిలోని వివేకానంద పాఠశాలలో ఏర్పాటు చేసిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ విజయశ్రీ, సీడీపీఓ అనురాధ, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సభ్యులు పాల్గొన్నారు.